క్లుప్తంగా

ఆలయ భూములకు కౌలు వేలం



సర్పవరంలో ఆలయ భూముల కౌలు వేలం నిర్వహిస్తున్న అధికారులు

కాకినాడ రూరల్: సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామివారి ఆలయ భూములకు శుక్రవారం ఆలయ ప్రాంగణంలో వేలం పాటలు నిర్వహించినట్లు ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. శ్రీమంత్రిప్రగడ వారి సత్రం గ్రేడ్–1 ఈఓ సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో మొత్తం 26.85 ఎకరాలకు గాను వేలం పాటలు నిర్వహించగా రూ.8.45 లక్షల ఆదాయం లభించిందని, గతం కంటే రూ.2.70 లక్షలు పెరిగిందని ఆయన తెలిపారు. వేలం పాటకు సంబంధించి భూముల వివరాలు ఇలా ఉన్నాయి. జగ్గంపేట మండలం రాజపూడి గ్రామంలో 2.70 ఎకరాలకు గాను రూ.36 వేలకు, పిఠాపురంలో 4.62 ఎకరాలకు గాను రూ.90 వేలు, గొల్లప్రోలు మండలం ఎ.విజయనగరంలో రూ.65 వేలకు, సర్పవరంలో భూమికి రూ.3.02 లక్షలు, ఇదే గ్రామంలో మరో సర్వే నంబర్లలోని భూమికి రూ.3.52 లక్షలు వేలం ద్వారా వచ్చింది.

మద్యం తాగి బైక్ నడిపిన వారికి జైలు

కాకినాడ లీగల్: మద్యం తాగి వాహనాలు నడిపిన కేసుల్లో ఏడుగురికి రెండు రోజుల చొప్పున జైలు, 14 మందికి రూ. 10 వేల చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి తీర్పు చెప్పారు. ఆ వివరాల్లోకి వెళ్తే.. కాకినాడ ట్రాఫిక్–1, 2 పోలీస్ స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. శుక్రవారం కోర్టులో 21 మందిని హాజరుపర్చగా వారికి పైవిధంగా జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.


పీజీ సెట్‌లో ప్రతిభ

బాలాజీచెరువు: ఏపీ పీజీసెట్–25లో ఆదిత్య డిగ్రీ విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారని కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు శుక్రవారం తెలిపారు. గణితంలో ప్రథమ ర్యాంక్‌తో పాటు 3, 5, 5, 8 ర్యాంకులు, కంప్యూటర్ సైన్స్‌లో 3, 8, 10 ర్యాంకులు, గణాంక శాస్త్రంలో 9వ ర్యాంక్ సాధించారన్నారు. ఎలక్ట్రానిక్స్ విభాగంలో 4, 5 ర్యాంకులు కైవసం చేసుకుని అగ్రగామిగా నిలిచారన్నారు. విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల కార్యదర్శి సుగుణారెడ్డి, ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్ అభినందించారని నాయుడు తెలిపారు.

సేవలకు గ్రహణం

సామర్లకోట: రైతు భరోసా కేంద్రాలు... ఈ పేరు చెప్పగానే రైతుల మోములో ఆనందం వెల్లివిరిసేది. ఇక్కడి నుంచే రైతులకు కావాల్సిన సేవలన్నీ అందేవి. ఇది వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాట. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేస్తోంది. ఇందులో భాగంగా మండలంలోని పీబీ దేవం గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని వ్యవసాయ కూలీలకు అడ్డాగా మార్చింది. ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులు కూలీల ద్వారా వరి నాట్లు వేయించడానికి నిర్ణయించారు. వెదజల్లు పద్ధతిలో నాట్లు వేస్తే ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మొలకలు దెబ్బతినే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీనికితోడు వెదజల్లు పద్ధతితో కేళీలు ఎక్కువగా వస్తున్నాయని రైతులు కూలీలతో వరి నాట్లు వేయడానికి నిర్ణయించారు. ఈ మేరకు కొంత మంది దళారులు బిహార్ నుంచి కూలీలను మండలానికి తీసుకువచ్చారు. ఈ కూలీలు వేగంగా వరి నాట్లు వేయడంతో పాటు వీరికి ఎకరానికి 10 కిలోల విత్తనం సరిపోతుంది. ఈ మేరకు పీబీ దేవం గ్రామానికి 30 నుంచి 35 మంది బిహార్ కూలీలు రావడంతో వారు నివాసం ఉండటానికి రైతు భరోసా కేంద్రం విడిదిగా ఇచ్చారని ఎంపీటీసీ సభ్యుడు మలకల సూరిబాబు, మాజీ సొసైటీ అధ్యక్షుడు మలకల వరహాలబాబు అన్నారు. రైతులకు సేవలు అందించాల్సిన కేంద్రాన్ని ఇలా మార్చడం ఏంటని అంటున్నారు. ఇక్కడ వంటలు చేసుకోవడానికి పాత్రలు తీసుకు వచ్చి అక్కడ పెట్టారన్నారు.

సినిమాలు



ఆనంద్ సినిమాస్	: కుబేర, 8 వసంతాలు, హౌ టు ట్రైన్ యువర్ డ్రాగన్, శుభం
దేవీ మల్టీప్లెక్స్	: 8 వసంతాలు, భైరవం, థగ్ లైఫ్, అందాల రాక్షసి
లక్ష్మి	: కుబేర
సత్యగౌరి	: సితారే జమీన్ పర్
తిరుమల	: కుబేర
సీఅండ్‌సీ	: హౌ టు ట్రైన్ యువర్ డ్రాగన్
సీఅండ్‌సీ–2	: కుబేర
శ్రీప్రియ	: 8 వసంతాలు
పద్మప్రియ	: కుబేర

నిప్పు.. కావాలి కనువిప్పు

- పంట వ్యర్థాల దహనంతో అనర్థాలు
- భూసారం కోల్పోతున్న వైనం



పొలంలో పంట వ్యర్థాలు కాల్చేసిన తర్వాత ఇలా..

కాకినాడ సిటీ: ఖరీఫ్, రబీలో ఏ పంట పూర్తయినా అవశేషాలను దహనం చేయడం రైతులకు అలవాటుగా మారింది. ఇలా చేయడం వల్ల అగ్ని ప్రమాదాలు సంభవించడంతో పాటు భూమిలో అనేక మార్పులు జరిగి భూసారం కోల్పోయే ప్రమాదం ఉంది. ఫలితంగా పంట దిగుబడులు తగ్గిపోయి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. దీనికి బదులుగా అవశేషాలను భూమిలో కలియదున్నడం వల్ల భూసారం పెరిగి తదుపరి పంటలో అధిక దిగుబడి పొందే అవకాశం ఉంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. కాకినాడ రూరల్, కాకినాడ సిటీ నియోజకవర్గాల పరిధిలో ఎక్కువగా వరి పంటను రైతులు సాగు చేస్తుంటారు. సుమారు 85 శాతం మంది రైతులు గత పంట అవశేషాలను కాల్చేస్తున్నారు. ప్రస్తుతం రెండు నియోజకవర్గాల్లో రబీ పంట పూర్తయి ఖరీఫ్ సాగుకు సిద్ధం అవుతున్నారు. రబీ పంట పూర్తయిన ప్రాంతాల్లో రైతులు పంట అవశేషాలను యథేచ్ఛగా దహనం చేస్తున్నారు. వ్యవసాయాధికారులు గతంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా ఫలితం లేకుండా పోయింది. రెండు నియోజకవర్గాల పరిధిలో సుమారు 15 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నారు. ఖరీఫ్‌లో వరి పంటను అత్యధికంగా సాగు చేస్తుండగా, కొద్ది శాతం మినప, పెసర, మొక్కజొన్న, కూరగాయలు వేస్తున్నారు. రబీలో పూర్తయిన పంటల అవశేషాలను సాగు భూముల్లోనే కాల్చి వేసి ఖరీఫ్ పంటకు భూమిని సిద్ధం చేసుకుంటున్నారు.

కలియ దున్నితే మేలు

పంటల అవశేషాలను భూమిలో కలియ దున్నడం వల్ల సేంద్రియ కర్బనం పెరిగి రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. పూర్వం రైతులు పంట అవశేషాలను భూమిలో కలియ దున్నేవారు. దీని ఫలితంగా అవి కుళ్లిపోయి తర్వాత పంటలకు మంచి ఎరువుగా మారేవి. కాలక్రమేణా రైతులు ఈ పద్ధతికి స్వస్తి చెప్పి పొలంలోనే తగుల పెట్టడం అలవాటుగా మార్చుకున్నారు. దీనివల్ల రైతులకు తెలియకుండానే భూమికి అనేక విధాలా నష్టం కలుగుతుంది. నిప్పు పెట్టడం వల్ల తర్వాత సాగు చేయబోయే పంటలకు నష్టం వాటిల్లడమే కాకుండా వాతావరణ కాలుష్యం, అగ్ని ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయి. ఇటీవల ఈ తరహా ఘటనలు అధికమవుతున్నాయి.

జరిగే అనర్థాలు ఇవీ..

పంటల వ్యర్థాలను కాల్చితే అనేక అనర్థాలు జరుగుతాయి. దీనివల్ల ప్రధానంగా నేల స్వాభావిత లక్షణాలు మారిపోతాయి. భూమిలోని సేంద్రియ కర్బనం తగ్గిపోతుంది. భూసారం తగ్గి పరోక్షంగా దిగుబడులపై ప్రభావం చూపుతుంది. నేలలో తేమ శాతం గణనీయంగా తగ్గుతుంది. నేలలో ఆమ్లగుణం క్షీణిస్తుంది. అధిక మోతాదులో రసాయన ఎరువులు వినియోగించాల్సి వస్తుంది. పర్యావరణ కాలుష్యం పెరిగి అనారోగ్యానికి ముప్పు వాటిల్లుతుంది. ఫలితంగా నేల సమతుల్యత దెబ్బతింటుంది. భూమి పొరల్లో పంటకు, నేలకు మేలు చేసే సూక్ష్మజీవులు నశించిపోతాయి.

మంచి ఎరువుగా..

పంటల అవశేషాలను రైతులు భూమిలో కలియదున్నాలి. అవశేషాలు కుళ్లిపోయి ఆ తర్వాత సాగు చేసే పంటకు మంచి ఎరువుగా ఉపయోగపడుతుంది. సేంద్రియ ఎరువుల వల్ల భూసారం పెరిగి నాణ్యమైన దిగుబడులు లభిస్తాయి. దీని వల్ల ఎరువుల వాడకం, పెట్టుబడులు తగ్గుతాయి. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చు.

– ఎస్.రమేష్, మండల వ్యవసాయాధికారి, కరప

వారాహి అమ్మవారికి కుంకుమ పూజలు



రమణయ్యపేటలో వారాహి అమ్మవారు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఎస్పీ సమీపంలోని రాజశ్యామల లలిత వారాహి మహా సన్నిధానంలో వారాహి నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం కుంకుమ పూజలు నిర్వహించారు. రెండో రోజు కిరాత వారాహి దేవిగా అమ్మవారికి పూజలు నిర్వహించి, హోమం చేశారు. నిర్వాహకుడు ఈశ్వర్ ఆధ్వర్యంలో పూజల అనంతరం భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. తమ్మవరం పరిధిలో పాముగుంట వద్ద శ్రీఐశ్వర్య వారాహి ధర్మక్షేత్రంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు.

13న కవలల సమ్మేళనం

బాలాజీచెరువు: వాసవీక్లబ్ ఆధ్వర్యంలో జూలై 13న కవలల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఇంటర్నేషనల్ అడ్మిన్ వైస్ ప్రెసిడెంట్ నాళం అండాళ్ తెలిపారు. స్థానిక సినిమా రోడ్‌లోని సూర్యకళా మందిరంలో కవల పిల్లల పెంపకం, అలాగే వారి జీవనశైలి, సంప్రదాయ వస్త్రధారణ, స్టోరీ టెల్లింగ్, జోడీ డ్యాన్స్‌కు సంబంధించి ఐదు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రతిభ చూపిన వారికి నగదు బహుమతులు అందజేస్తామన్నారు. 25 ఏళ్ల లోపు కవలలు పాల్గొనవచ్చని అన్నారు.

స్వర్ణోత్సవాలకు రావాలని ఆహ్వానం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబును జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కె.పద్మనాభం, రాష్ట్ర అధ్యక్షుడు శాస్త్రులు శుక్రవారం కాకినాడలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఈ ఏడాది పెన్షనర్ల సంఘ స్వర్ణోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో 50 ఏళ్ల సావనీర్ ఆవిష్కరణకు సతీష్‌బాబును ఆహ్వానించామని పద్మనాభం తెలిపారు. అలాగే జూలై 5న జరిగే మనకోసం మనం కార్యక్రమానికి రావాలని కోరామన్నారు.

'తల్లికి వందనం' మాకెందుకు ఇవ్వలేదు!

- పలు గ్రామాల సర్పంచ్‌ల నిలదీత
- కరప మండల సమావేశంలో చర్చ



తల్లికి వందనం ఆపేశారని ప్రశ్నిస్తున్న వేములవాడ సర్పంచ్ మంగాదేవి



మండల అభివృద్ధి గురించి వివరిస్తున్న ఎంపీపీ శ్రీలక్ష్మి

కరప: గ్రామ సర్పంచ్‌లు ప్రభుత్వ ఉద్యోగులని, లేనిభూమి ఉన్నట్టు నమోదు కావడంతో తల్లికి వందనం పథకం ఆపేశారంటూ సర్పంచ్‌లు ధ్వజమెత్తారు. ప్రభుత్వ ఉద్యోగులుగా పర్మినెంట్ చేసి, తమ పేరున నమోదైన భూమిని రాసివ్వాలంటూ వారు డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. దీనిలో రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పాల్గొని, శాఖల వారీగా సమీక్ష జరిపారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి మాట్లాడుతూ మండలంలో 11,223 మందికి రూ.4.83 కోట్ల విలువైన పింఛన్లు ఇస్తున్నామన్నారు. తల్లికి వందనం పథకంలో 9,858 మంది లబ్ధిదారులుండగా 8,363 మందికి రూ.12.54 కోట్లు ఇచ్చారన్నారు. మంజూరు కానివారు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉపాధి పథకంలో 90 సీసీ రోడ్లకు రూ.8.80 కోట్లు మంజూరు కాగా, 76 సీసీ రోడ్లు పూర్తయ్యాయన్నారు. కరప శ్మశానంలో తగిన వసతులు లేక దహన సంస్కారాలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనికి రూ.15 లక్షలు మంజూరు చేయాలని ఎంపీపీ కోరారు. సర్పంచులు గౌరవ వేతనం తీసుకుంటుంటే, ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించి తల్లికి వందనం పథకం ఆపేయడం ఎంతవరకూ సమంజసమని వేములవాడ సర్పంచ్ కమిడి మంగాదేవి ప్రశ్నించారు. భూమి లేకపోయినా భూమి ఉందంటూ కూడా పథకం నిలిపివేశారంటూ సర్పంచులు ధ్వజమెత్తారు. సర్పంచుల పదవీకాలం మరో 9 నెలలు మాత్రమే ఉండగా, శిక్షణ ఎందుకు ఇచ్చారో తెలియడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తల్లికి వందనం పథకం రాని సర్పంచ్‌లు రాతపూర్వంగా ఫిర్యాదు చేస్తే, తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బదులిచ్చారు. వివిధ సమస్యలను సర్పంచులు వాసంశెట్టి రామారావు, మంగాదేవి, కె.రమాదేవి, గోపి సత్యవేణి, ఎంపీటీసీ సభ్యులు అనసూరి శ్రీనివాస్, చక్కపల్లి ఫకీర్రావులు తెలుపగా, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వివరించారు. ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి మాట్లాడుతూ పెనుగుదురు, ఉప్పలంక, యండమూరు గ్రామాల్లో మూడు జెడ్పీ ఉన్నత పాఠశాలలు, 15 మోడల్ ప్రైమరీ స్కూళ్లకు 28 ఉపాధ్యాయ పోస్టులు మంజూరయ్యాయన్నారు. కరప, వేళంగి పీహెచ్‌సీ వైద్యులు వి.ఏంజలిన్, అనూష మాట్లాడుతూ వర్షాకాలంలో డయేరియా ప్రబలకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఎంఏఓ ఇమ్మిడిశెట్టి సత్య మాట్లాడుతూ మండలంలో 14 వేల ఎకరాల్లో సాగు జరుగుతుందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ వీవీఎస్ వర్ధన్ మాట్లాడుతూ మండల పరిధిలో జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ.22 కోట్లతో 52 పనులు మంజూరు కాగా 24 పనులు పూర్తయ్యాయన్నారు. తహసీల్దార్ ఎన్.సత్యనారాయణ మాట్లాడుతూ 550 మందికి జాయింట్ ఎల్‌పీ నమోదు కావడంతో రైతుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎంపీడీఓ ఎం.అనుపమ, డిప్యూటీ ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు, ఏఓ బీఎల్ నరసింహం, ఇరిగేషన్ ఏఈఈ ఎస్.నాగభవానీ, ఏపీఎం ఎంఎస్‌బీ దేవి, విద్యుత్‌శాఖ ఏఈ సానా ఈశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం డ్రైడే పాటిద్దాం



తడి, పొడి చెత్త, డ్రైడే గురించి గ్రామస్తులకు వివరిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు

కరప: అంటు వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండాలంటే గ్రామాల్లో ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు సూచించారు. సిరిపురంలో శుక్రవారం ఆయన పర్యటించి పంచాయతీ సిబ్బందికి డ్రై డే గురించి వివరించారు. గ్రామాల్లోని మంచినీటి పథకం ఓవర్‌హెడ్ ట్యాంకులను వారానికొకసారి తప్పనిసరిగా శుభ్రం చేయించాలన్నారు. క్లోరినేషన్ చేసిన తర్వాతే తాగునీరు సరఫరా చేయాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలన్నారు. గ్రామ కార్యదర్శులు, పంచాయతీ, వైద్య సిబ్బందితో కలసి గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి నీరు నిల్వ లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండటం వల్ల డెంగీ, చికెన్ గున్యా, మలేరియా వంటి వ్యాధులకు కారకాలైన దోమలు పెరుగుతాయన్నారు. ఇంటి ఆవరణలో వివిధ పాత్రల్లో నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికీ వచ్చినప్పుడు తడి, పొడి చెత్త విడదీసి ఇవ్వాలన్నారు. సేకరించిన చెత్తను ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రానికి తరలించాలన్నారు. గ్రామ కార్యదర్శి జి.దుర్గాభవాని, వైఎస్సార్ సీపీ నాయకుడు సున్న వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ బలుసు వాసు అన్నారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు బ్యాగ్‌ల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించగా, పాఠశాలలో కొత్తగా చేరిన విద్యార్థులకు కిట్లు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పి మిగిలిన విద్యార్థుల తల్లిదండ్రులకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ మాట్లాడారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



నూతన భవనంలో మేనేజర్ మోహన్‌రంగా, ఆర్‌ఎంలు రమణమూర్తి, ఏఎస్‌ఎన్ మూర్తి

కాకినాడ రూరల్: సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తున్నట్టు రీజనల్ మేనేజర్లు ఏపీ రమణమూర్తి, ఏఎస్‌ఎన్ మూర్తి అన్నారు. కాకినాడ రూరల్ వలసపాకలలోని బ్రాంచ్‌ను సర్పవరం జంక్షన్ వద్ద నూతన భవనంలోకి మార్పు చేయడంతో శుక్రవారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ మోహన్‌రంగా ఆధ్వర్యంలో మీడియా సమావేశంలో ఆర్‌ఎంలు రమణమూర్తి, ఏఎస్‌ఎన్ మూర్తి మాట్లాడారు. విశాఖ రీజియన్ పరిధిలో 40 బ్రాంచ్‌లు ఉండగా.. కాకినాడ నగరం, రూరల్‌లో నాలుగు బ్రాంచ్‌లు ఉన్నాయన్నారు. వలసపాకల బ్రాంచ్ ఏర్పాటు చేసిన 12 ఏళ్లలో ఇప్పటికి రూ.63 కోట్ల వ్యాపారం జరిగిందని, రూ.వంద కోట్ల లక్ష్యంతో నూతన భవనంలో సేవలు విస్తృతం చేయనున్నట్టు తెలిపారు. రైతులు, వ్యాపారులు, విద్యార్థులకు రుణాలతో పాటు బంగారంపై రుణాలు అందిస్తున్నామన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రత్యేక రాయితీలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఆషాఢ మాసం సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రత్యేక రాయితీలు ఇస్తున్నట్లు కాకినాడ డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 28 నుంచి జూలై 26 వరకూ ఈ ప్రత్యేక రాయితీ ఉంటుందన్నారు. కాకినాడ నుంచి హైదరాబాద్, కర్నూల్, బెంగళూరు, తిరుపతి వెళ్లే వెన్నెల, అమరావతి, ఇంద్ర, వంటి సర్వీసులకు 10 శాతం రాయితీ ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైద్య పరికరాల వితరణ

కాకినాడ క్రైం: ప్రముఖ ఫిజీషియన్, స్నేహా హాస్పిటల్ అధినేత డాక్టర్ రామ్‌స్వరూప్ జవహర్ తన దాతృత్వాన్ని చాటుకున్నారు. కాకినాడ జీజీహెచ్‌లోని ఆర్థోపెడిక్ ఆపరేషన్ థియేటర్‌కు అవసరమైన వైద్య పరికరాలను వితరణగా అందించారు. ఈ మేరకు శుక్రవారం రూ.42 వేల విలువైన పరికరాలను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి చేతుల మీదుగా ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్, ఆర్థోపెడిక్స్ హెచ్‌ఓడీ డాక్టర్ ఎంపీఆర్ విఠల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు లావణ్యకుమారి, విఠల్ మాట్లాడుతూ డాక్టర్ జవహర్ పేదల ఆరోగ్య భద్రతకు కట్టుబడి ఉన్నారన్నారు. అనంతరం ఆయన్ని సత్కరించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేసిన వారిని అభినందిస్తున్న సరస్వతి, కృష్ణకుమారి

బోట్‌క్లబ్: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఇనిస్టిట్యూట్ ఆఫ్ బ్యూటీ అండ్ హెయిర్ సైన్స్ (ఐబీహెచ్‌ఎస్) డైరెక్టర్స్ మెట్టా రాధ సరస్వతి, అప్పసాని కృష్ణకుమారి తెలిపారు. స్థానిక భానుగుడిసెంటర్‌లోని ఐబీహెచ్‌ఎస్ కార్యాలయంలో శుక్రవారం వరల్డ్ బ్యూటీషియన్స్ డే సందర్భంగా సభ్యులు రక్తదానం చేశారు. ఆపద సమయంలో ఎంతో మంది రక్తం అందకపోవడంతో మరణిస్తున్నారన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చన్నారు. రోటరీ బ్లడ్‌బ్యాంకు సౌజన్యంతో రక్తదానం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రోటరీ బ్లడ్ బ్యాంకు చైర్మన్ ఉదయభాను మాట్లాడుతూ మహిళలూ రక్తదానం చేయడం గొప్ప విషయమన్నారు. రక్తదానం చేసిన సభ్యులను అభినందించారు. అనంతరం వరల్డ్ బ్యూటీషియన్ డే సందర్భంగా కేక్ కట్ చేశారు.

అదిగో.. ఇదిగో అంటూ..

- పవన్ ఇలాకాలో దళితులకు దగా
- ఏడాదిగా అభివృద్ధి పనులకు ఆమోదం తెలపని అధికారులు
- పెండింగ్‌లో రూ.1.20 కోట్ల విలువైన పనులు



పిఠాపురం ఒకటో వార్డులో అధ్వానంగా డ్రైన్లు



అగ్రహారంలో రోడ్డుపైకి చేరిన మురుగునీరు



పిఠాపురం అగ్రహారంలో మూసుకుపోయిన కాలువ

పిఠాపురం: సమస్యలెన్నో వెంటాడుతున్నాయి.. వాటి పరిష్కారానికి నిధులూ అందుబాటులో ఉన్నాయి.. అయితే పనులు చేయించడానికి ఆమోదం తెలపక అభివృద్ధికి గ్రహణం పట్టింది.. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నియోజకవర్గం పిఠాపురంలో దళిత వాడల పరిస్థితి ఇది. కౌన్సిల్ ఆమోదించినా అధికారులు ఆ పనులకు ఆమోదం తెలపకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. కేవలం కూటమి నేతల ఒత్తిడితోనే అధికారులు ఆ పనులను ఆపేశారంటూ పలువురు ఆరోపిస్తున్నారు. దళితవాడల అభివృద్ధికి తాను కృషి చేస్తానని చెప్పిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఇలాకాలో ఇలాంటి ఘటనపై అంతా నివ్వెరబోతున్నారు.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో దళిత వాడల అభివృద్ధికి నాబార్డు నిధులు రూ.1.20 కోట్లు కేటాయించారు. పిఠాపురంలో దళితవాడ అయిన అగ్రహారం 1, 30 వార్డుల్లో మౌలిక సదుపాయాలైన రోడ్లు, డ్రైన్లు వంటి పనులు చేయడానికి ప్రతిపాదనలు చేయగా అప్పట్లో కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అయితే ఎన్నికలు రావడంతో వాటిని ప్రారంభించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆయా పనులను ప్రారంభించ లేదంటూ రద్దు చేశారు. అనంతరం మళ్లీ ఆ పనులను కౌన్సిల్ సమావేశానికి తీసుకురాగా, 10 మంది టీడీపీ, జనసేన కౌన్సిలర్లు వ్యతిరేకించగా 18 మంది కౌన్సిలర్లు ఆమోదించడంతో ఆ పనులు ఆమోదం పొందాయి. ఇది జరిగి నెలలు గడుస్తున్నా మున్సిపల్ అధికారులు మాత్రం వాటికి వర్క్ ఆర్డర్లు ఇవ్వకుండా తాత్సారం చేస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. పలువురు దళిత కౌన్సిలర్లు అధికారుల వద్దకు వెళ్లి అడుగుతున్నా అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేయడం వెనుక కూటమి నేతల ఒత్తిడి ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ నేతలు మున్సిపల్ పాలకవర్గంగా ఉండడంతో వారు ఆమోదించిన పనులు చేయకూడదని కూటమి నేతలు ఒత్తిడి తెస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. అందులోనూ దళిత వాడల్లో అభివృద్ధి జరగకూడదని అడ్డు తగులుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై వివరణ కోరేందుకు ప్రయత్నించగా అధికారులు అందుబాటులో లేరు.

ఆమోదం పొందినా..

ఎన్నో ఏళ్లుగా మా ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదు. మా వార్డుల్లో అభివృద్ధి పనులకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాబార్డు నిధులు రూ.1.20 కోట్లు కేటాయించింది. పనులు ప్రారంభించే సమయానికి ఎన్నికలు రావడంతో ప్రారంభం కాలేదు. ఎన్నికల అనంతరం ప్రస్తుత ప్రభుత్వం మా వార్డుల్లో కేటాయించిన పనులను రద్దు చేసింది. అయినప్పటికీ మేము మళ్లీ కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లి ఆమోదం పొందాం. అయినా మా పనులు చేయనివ్వడం లేదు. దీనిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పట్టించుకోకపోవడం సరికాదు.

– వజ్రపు శైలజా రాజశేఖర్, 1వ వార్డు కౌన్సిలర్, పిఠాపురం అగ్రహారం

అడ్డుకుంటే ఊరుకోం..

దళితులను చిన్నచూపు చూస్తూ మా ప్రాంతంలో అభివృద్ధిని అడ్డుకుంటే చూస్తు ఊరుకోం. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నియోజకవర్గంలో దళిత వాడలపై ఇలా చిన్నచూపు చూడడం సరికాదు. కేవలం దళిత వాడలే కదా అన్న ఒకేఒక కారణంతో ఇక్కడ పనులు అడ్డుకుంటున్నట్లు తెలుస్తోంది. కూటమి నేతల ఆదేశాలతో అధికారులు మా ప్రాంత అభివృద్ధిని ఆపేస్తున్నారు. వెంటనే పనులు ప్రారంభించక పోతే ఉద్యమిస్తాం.

– వజ్రపు భువనేశ్వరి వీరేష్, 30వ వార్డు కౌన్సిలర్, పిఠాపురం అగ్రహారం

మరిడమ్మకు ప్రత్యేక పూజలు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చింతావారి వీధిలో..

పిఠాపురం: స్థానిక చింతావారి వీధిలోని మహాలక్ష్మి గణపతి సహిత సీతారామాంజనేయ ఆలయంలో శుక్రవారం మహాలక్ష్మి అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో వారాహి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.